ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

గురువారం 26 డిసెంబరు 2024 | 5



కాకినాడ సర్పవరం పూల మార్కెట్ ఆవరణలో శాంతా క్లాజ్ సందడి

ఏసయ్య.. వచ్చాడని..

రక్షకుడు ఉదయించినాడట.. మన కొరకు పరమ రక్షకుడు ఉదయించినాడట.. అంటూ బుధవారం ఉదయం నుంచి ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా చేసుకున్నారు.. విశ్వాసులు పెద్దఎత్తున చర్చిలకు హాజరై ప్రార్థనలు చేశారు.. హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నాయకులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.



కరప మండలం గొర్రిపూడి చర్చిలో శిలువ ఆకారంలో కొవ్వొత్తుల వెలుగులు



కాకినాడ జగన్నాథపురం సెయింట్ ఆన్స్ రోమన్ కేథలిక్ చర్చిలో..





కాకినాడ కల్వరి టెంపుల్ ఆవరణలో



భానుగుడి జంక్షన్ పోలీస్ క్వార్టర్స్‌లో బాప్టిస్టు చర్చి ఆవరణలో



జగన్నాథపురం సెయింట్ ఆన్స్ రోమన్ కేథలిక్ చర్చిలో కొవ్వొత్తులు వెలిగిస్తూ

కాకినాడ హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో ప్రసంగం



అమ్మడే.. అధరహో!

పండుగకు ఊరొచ్చేదెలాగో..

- పండుగ బాదుడే..బాదుడు
- బస్సులు, రైళ్ల టిక్కెట్ల ధరలు ఫుల్
- విమాన చార్జీలకు రెక్కలు
- హైదరాబాద్ నుంచి రూ.7,500
- బెంగళూరు నుంచి రూ.8 వేలు
- రోజుకు ఆరు ఇండిగో సర్వీసులు
- అప్పుడే సగానికిపైగా టికెట్లు ఫుల్
- బస్సు చార్జీలు పెంచేశారు
- ఏసీ స్లీపర్ టిక్కెట్లు రూ.3,900
- పిండేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్
- అన్ని ట్రైన్లలోను రిగ్రెట్
- గోదావరివాసులకు పండగ షాక్

పండుగకు వెళ్లాలి ఎలాగైనా.. ఇదీ ప్రతి ఒక్కరి ఆశ.. ఈ ఆశనే కొందరు క్యాష్ చేసుకుంటారు.. ప్రతి ఏడాది ఇంతే.. ఈ ఏడాది జరుగుతున్నది ఇదే.. హైదరాబాద్.. బెంగళూరు.. చెన్నై.. పుణె ఇలా ఏ పెద్ద నగరంలోనైనా గోదావరి జిల్లాల వాళ్లు ఉండకుండా ఉండరు.. వీళ్లంతా కుటుంబంతో కలిసి ప్రతి ఏడాది పండుగకు వస్తారు.. స్వగ్రామాల్లో ఆనందంగా గడిపి వెళ్లిపోతారు.. ప్రస్తుతం అక్కడి నుంచి రావడమే గగనంగా మారింది.. పండుగకు సుమారు మూడు వారాలున్నా ధరలు పెంచేశారు.. రైళ్లు.. బస్‌లు.. విమానాలు.. ఏవి చూసినా అంతే.. అప్పుడే ధరలు అదరగొట్టేస్తున్నాయి..

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగకు ఊరు రావాలనుకునే వారికి అప్పుడే టికెట్ చార్జీలు షాక్ కొడుతున్నాయి. విమాన టిక్కెట్ల నుంచి బస్సు, రైలు టికెట్లు చుక్కలు చూపిస్తున్నాయి. అడ్డగోలుగా రేట్లు పెంచేసి అప్పుడే ఆయా ట్రావెల్స్ ప్రయాణికుల జేబులు గుల్ల చేసేస్తున్నాయి. దీంతో ఎక్కడెక్కడి నుంచో పండగకు ఊరొద్దామని ఆశపడే వారికి ప్రయాణం ప్రయాసగా మారిపోయింది. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంతోపాటు అనేక పట్టణ ప్రాంతాలకు చెందినవారు వ్యాపార, ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో అధికంగా స్థిరపడ్డారు. బెంగళూరు, చెన్నైతోపాటు అనేక ప్రాంతాల్లోను ఉమ్మడి జిల్లా వాసులు వివిధ అవసరాలరీత్యా ఉంటున్నారు. వీరంతా ఎలాగైనా పెద్ద పండగకు ఊరు రావాల్సిందే. అయితే పండగ దగ్గర పడడం, ఇంకా మూడు వారాలు కూడా లేకపోవడంతో సొంతూరుకు రావడానికి టికెట్లు బుక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తే చార్జీలు షాక్ కొట్టేస్తున్నాయి. పండగకు రావడమే కాదు.. తిరుగు ప్రయాణం టిక్కెట్లు సైతం అప్పుడే వేలల్లోకి ఎగబాకి చుక్కలు చూపించేస్తున్నాయి. విమానం, రైలు, బస్సు వేటి ధరలు చూసినా బెంబేలెత్తిస్తున్నాయి.

ట్రావెల్స్ బాదుడే బాదుడు..

పండగకు కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ జిల్లాలకు చెందిన అనేకమంది హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి భారీగా స్వగ్రామాలకు ముందే చేరుకుంటారు. దీంతో అనేక మంది బస్సు టిక్కెట్లకు ప్రయత్నిస్తుంటే చార్జీలు గూబగుయ్‌మనేలా చేస్తున్నాయి. ప్రధానంగా ప్రైవేటు ట్రావెల్స్ అయితే చుక్కలు చూపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో ఏసీ స్లీపర్ బస్సు చార్జీలు హైదరాబాద్ నుంచి కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురానికి రూ.1,099 నుంచి రూ.1,100 వరకు ఉండగా పండగా పేరుతో ఏకంగా రూ.3,990 వరకు పిండేస్తున్నాయి. ప్రధానంగా హైదరాబాద్ నుంచి కాకినాడ, రాజమహేంద్రవరానికి సుమారుగా 12కిపైగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు రోజుకు 50కిపైగా సర్వీసులు నడుస్తాయి. పండగకు వీటిని దాదాపు 70 వరకు పెంచాయి. వీటిలో ఇప్పుడు పండగ చార్జీలు రూ.3,200 నుంచి రూ.3,900 వరకు వసూలు చేస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే సాధారణ రోజుల్లో చార్జీలతో పోల్చితే మూడు రెట్లు పెంచేశారు. వాస్తవానికి ఇప్పుడు శీతాకాలం నేపథ్యంలో బస్సుల్లో ఏసీ చార్జీలను తగ్గించాలి. కానీ సంక్రాంతి పండగ పేరుతో అడ్డంగా బాదేస్తున్నాయి. అయితే పండగ దగ్గరపడితే ఈ చార్జీలు రూ.5వేలకుపైగా ఎగబాకినా ఆశ్చర్యపోనవసరంలేదు. మరోపక్క ఈ రూట్లో ఆర్టీసీ బస్సులు నాన్‌ఏసీ కేటగిరీలో రూ.770 వరకు వసూలు చేస్తున్నా చాలావరకు సీట్లు నిండిపోయాయి. ఇదిలా ఉండగా హైదరాబాద్ నుంచి కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతోపాటు అమలాపురం పట్టణానికి ఆర్టీసీ వచ్చే నెల 9,10,11,12 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వీటిలోనూ చాలావరకు సీట్లు నిండిపోయాయి.

రైళ్లన్నీ రిగ్రెట్..

హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, సామర్లకోటకు రోజుకు దాదాపు 17 రైళ్లు నడుస్తుంటాయి. ఎక్కువమంది పండగకు రైళ్లలో రావడానికి ప్రయత్నిస్తారు. కానీ సంక్రాంతి నేపథ్యంలో వీటిలో సీట్లన్నీ నిండిపోవడంతోపాటు ఏకంగా రిగ్రెట్ చూపిస్తోంది. ఎన్ని రైళ్లు రద్దీగా ఉన్నా కొంతకాలం కిందట ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్లలో సీట్లు కొంతవరకు ఎప్పుడూ ఖాళీగా ఉంటాయి. కానీ పండగ రద్దీ నేపథ్యంలో వీటికి కూడా సీట్లు రిగ్రెట్ చూపిస్తున్నాయి. ప్రధానంగా వచ్చే నెల 9 నుంచి అయితే అసలు వెయిటింగ్ లిస్ట్ కాదు కదా అవి కూడా నిండిపోయి రిగ్రెట్ దశకు వచ్చేశాయి. విశాఖ ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి గరీబ్‌రథ్, గోదావరి, ఫలక్‌నుమా, జన్మభూమి, గౌతమి, ఈస్ట్‌కోస్ట్, విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ పూర్తిగా రద్దీగా మారి రిగ్రెట్ చూపిస్తున్నాయి. దీంతో జనం సొంతూళ్లకు రావడానికి నానా తంటాలు పడాల్సిన పరిస్థితి. విమానాల దగ్గర నుంచి బస్సులు, రైళ్ల ఎక్కడికక్కడ సీట్లన్నీ అప్పుడే ఫుల్ అయిపోయాయి. అటు దగ్గరచేసి తత్కాల్‌లో టికెట్లు తీసుకుందామన్నా బాదుడు మామూలుగా లేదు. దీంతో చాలామందికి దిక్కుతోచడం లేదు.

ఎగరాలంటే జేబులు గుల్లే..

ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాలకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు ఎక్కువగా జనం వస్తుంటారు. ప్రస్తుతం చాలామంది వేగంగా రావడం కోసం విమానాలపైనే ఆధారపడుతున్నారు. తీరా ఇప్పుడు వీటి చార్జీలు ఆకాశాన్నంటేశాయి. ప్రధానంగా వచ్చే నెల 13 నుంచి భోగి పండగ మొదలు కానుంది. ఈ మేరకు ముందుగానే జనం టిక్కెట్లకు ప్రయత్నిస్తుంటే వేలకు వేలు పిండేస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఇండిగో సంస్థ రోజుకు ఆరుకుపైగా సర్వీసులు నడుపుతోంది. సాధారణ రోజుల్లో ఫ్లైట్ టికెట్ ధర రూ.3,999 వరకు ఉంటోంది. కానీ సంక్రాంతి పండగ పేరుతో అప్పుడే ఇండిగో చార్జీలు ఆకాశన్నంటేశాయి. ప్రధానంగా జనవరి 7న హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఫ్లైట్ టిక్కెట్ ఒకరికి రూ.4,510 ఉంది. జనవరి 8న రూ.5,350, 9న రూ.6,190, 7న రూ.7,135, 8న రూ.5,350, 9న రూ.6,190, 10న రూ.7,135, 11న రూ.7,765 12న రూ.6,610, 13న రూ.4,510వరకు వసూలు చేస్తోంది. అయితే పండగకు ఇంకా రెండువారాలకు పైగా సమయం ఉండడంతో ఇప్పుడే ఈ ధరలు షాక్ కొడుతుండగా.. సమయం దగ్గర పడే కొద్దీ ఈ చార్జీలు రూ.14 వేలకుపైగా ఎగబాకనున్నాయి. అటు పండగ ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణం అయ్యే వారికి సైతం చార్జీలు దడ పుట్టిస్తున్నాయి. ప్రధానంగా జనవరి 16 నుంచి ఏకంగా అప్పుడే టికెట్ చార్జీలు రూ.9,700కు ఎగబాకేశాయి. వ్యవధి దగ్గరపడే కొద్దీ చార్జీలు రూ.16 వేలకుపైగా ఉండే అవకాశం ఉంది. అటు బెంగళూరు నుంచి రాజమహేంద్రవరం సాధారణ రోజుల్లో ఇండిగో చార్జీలు రూ.3,999 కాగా పండగ పేరుతో అప్పుడే రూ.7,800 వరకు పిండేస్తోంది. ప్రధానంగా ఈ రూట్లో రోజూ నడిచే ఆరు సర్వీసుల్లో వచ్చే జనవరి ఏడవ తేదీన టికెట్ చార్జీ రూ.5,983 కాగా 8న రూ.7,095, 9న రూ.7,020, 10న రూ.8,265, 11న రూ.7,851, 12న రూ.7,851 13వ తేదీన రూ.6,412 వరకు ఉంది.



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

ప్రభుత్వం సకాలంలో స్పందించి ఆదుకుంది..

మత్స్యకారులను పరామర్శించిన కొండబాబు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సకాలంలో స్పందించి నడిసముద్రంలో చిక్కుకున్న మత్స్యకారుల ప్రాణాలను కాపాడిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు ఒడ్డుకు సురక్షితంగా రాగా వారిని బుధవారం ఆయన కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న మత్స్యకారులను తమ ప్రభుత్వం రక్షిస్తుందన్నారు. నడి సముద్రంలో మత్స్యకారులు వెళ్లిన ఫైబర్ బోట్ ఆగిపోవడంతో తనకు తెలిసిన ఈ సమాచారాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా మత్స్యశాఖ అధికారికి తెలియజేశామన్నారు. అధికారులు వెంటనే కోస్ట్‌గార్డ్, మెరైన్, ఓఎన్‌జీసీ బృందాలను అప్రమత్తం చేసి ఆపదలో ఉన్నమత్స్యకారులను రక్షించారన్నారు. అనంతరం మత్స్యకారుల కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడారు. ప్రభుత్వం నుంచి మత్స్యకారులకు రావాల్సిన సాయం అందిస్తామన్నారు. మత్స్యకారులను సకాలంలో కాపాడిన అధికార బృందాలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో కోస్ట్‌గార్డ్ కాకినాడ స్టేషన్ కమాండర్ రాజేంద్రకుమార్, ఓఎన్‌జీసీ అధికారి లోవరాజు, జిల్లా మత్స్యశాఖ అధికారి కరుణాకర్, టీడీపీ నాయకులు తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, బచ్చు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సూరాడపేటలో అలల ఉధృతికి విరిగిన సిమెంటు రోడ్డు

అల్పపీడనాల దెబ్బకు ఉప్పాడలో విరిగిన సిమెంటు రోడ్డు

కొత్తపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో తరచూ ఏర్పడిన అల్పపీడనాల ప్రభావంతో ఉప్పాడ తీరంలో మత్స్యకారుల ఇళ్లతోపాటు గ్రామంలో నిర్మించిన సిమెంటు రోడ్డు కూడా కెరటాల ధాటికి ముక్కలయ్యాయి. తీరంలో ఈదురు గాలులు, అలల ఉధృతి కొనసాగుతూనే ఉంది. బుధవారం కూడా కోనపాపపేటలో, ఉప్పాడ తీరంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. మయాపట్నం, సూరాడపేట, కొత్తపట్నంలలో గతంలో కోత నివారణకు నిర్మించిన జియోట్యూబ్ టెక్నాలజీ ఆనవాలు లేకుండా కొట్టుకొనిపోయింది. గతంలో ఎన్నో తుపాన్లల్లో రాక్షసి అలల ధాటిని తట్టుకొని గ్రామానికి రక్షణ కవచంగా నిలబడిన జియోట్యూబ్ ఇటీవల ఏర్పడిన వరుస అల్పపీడనాలు, తుపాన్ల బారి నుంచి తట్టుకోలేకపోయిందని మత్స్యకారులు వాపోతున్నారు. జియోట్యూబ్ నిర్మాణం తర్వాత సంబంధిత అధికారులు లేకపోవడంతో పూర్తిగా పాడయ్యిందన్న విమర్శలు ప్రజల నుంచి వినబడుతున్నాయి. ఇప్పటికైనా తీర ప్రాంత రక్షణకు పటిష్టమైన శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తీరంవాసులు చెబుతున్నారు.

కల నెరవేరేలా..

- టిడ్కో ఫ్లాట్ల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం దృష్టి
- అసంపూర్తి నిర్మాణాలు, సదుపాయాల పూర్తికి ప్రణాళికలు



కాకినాడ పర్లోవపేటలో నిర్మాణం పూర్తి కాని టిడ్కో గృహ సముదాయం

(ఆంధ్రజ్యోతి-సామర్లకోట)

ఆంధ్రప్రదేశ్ పట్టణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీ టిడ్కో) గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఫ్లాట్లను త్వరితగతిన అప్పగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో లబ్ధిదారుల్లో కొత్త ఆశలు చిగురించాయి. గతంలో టిడ్కో ఇళ్లను మూడు కేటగిరీలుగా నిర్మాణాలు చేపట్టి 2019 ఎన్నికలు సమీపించే సమయానికి నిర్మాణాలు పూర్తి చేయడమేగాక సామూహిక గృహప్రవేశాలు సైతం చేయించారు. అదే సమయంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో సదరు ఫ్లాట్లను లబ్ధిదారులకు అప్పగించలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి నిర్మాణాలతోపాటు అక్కడ మౌలిక సదుపాయాలను సైతం పక్కనబెట్టేసింది. పైగా లబ్ధిదారుల జాబితా వడపోత కార్యక్రమం చేపట్టింది. తమకు అనుకూలమైన వారిని అందులో చేర్చే ప్రయత్నం చేసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సిన మొత్తాన్ని కూడా లబ్ధిదారులపై రుణరూపంలో భారం మోపుతూ బ్యాంకులకు లింకు పెట్టారు. దీంతో కొందరు లబ్ధిదారులు ఆ ఫ్లాట్లను తీసుకునేందుకు విముఖత చూపారు. మౌలిక వసతులు కల్పించకపోవడంతో మరికొందరు ఆ ఫ్లాట్లలోకి దిగేందుకు వెనుకాడారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో లబ్ధిదారులకు చేసిన ఒప్పందంలో భాగంగా బ్యాంకు లింకేజీ రుణాలు లేకుండా అప్పగిస్తారనే ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇటు టిడ్కో గృహాల వద్ద అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తిచేయడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు ఏమేరకు నిధులు అవసరమవుతాయో వాస్తవ పరిస్థితి తెలుసుకునేందుకు ప్రభుత్వం ఓ కమిటీని నియమించి అధ్యయనం చేపట్టింది. ఎంతమేర నిధులు అవసరం అవుతాయో తేల్చింది. ఇదిలా ఉండగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, కాకినాడ నగరపాలక సంస్థలతోపాటు సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, అమలాపురం, మండపేట మున్సిపల్ పట్టణాలలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏపీ టిడ్కో ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. మొదటి ఫేజ్‌లో 19,242, రెండవ ఫేజ్‌లో 12,982, మూడవ ఫేజ్‌లో 27,610 ఫ్లాట్‌లు మంజూరుకాగా, టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని మౌలిక వసతులతో 25,360 ఫ్లాట్‌ల నిర్మాణాలు పూర్తిచేసింది. అప్పట్లో మూడు ఫేజ్‌లతో కలిపి చేపట్టిన 59,834 ఫ్లాట్‌లను పూర్తిచేయాలా, ఇప్పటికే నిర్మాణాలు పూర్తిచేసి ఉన్న ఫ్లాట్లను లబ్ధిదారులకు అప్పగించడమా అనే మీమాంసలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

టిడ్కో ఇళ్లు ఇలా.. వాయిదా కట్టేదెలా..

(కాకినాడ సిటీ- ఆంధ్రజ్యోతి)

ఏళ్లు గడుస్తున్నా కాకినాడ నగరంలో టిడ్కో ఇళ్లు పూర్తికావడం లేదు. అయినా వాయిదాలు కట్టాలని బ్యాంకర్లు లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నారు. అప్పు చేసి లక్ష రూపాయలు డిపాజిట్ కట్టామని, ఫ్లాట్లు అప్పగించకుండా వాయిదాలు ఎలా కట్టగలమని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. కాకినాడ పర్లోవపేట ఏరియాలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన 1920 ఫ్లాట్లకుగాను ఫేజ్-1లో 36 బ్లాక్‌లలో నిర్మాణం పూర్తయిన 1152 ఫ్లాట్లను లబ్ధిదారులకు అప్పగించారు. ఫేజ్-2లో 24 బ్లాక్‌లలో 768 ఫ్లాట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఫేజ్-1 ఇళ్ల సముదాయంలో ఎటువంటి సౌకర్యాలు లేక లబ్ధిదారులు ఇళ్లలోకి దిగలేదు. తాగునీటి పైప్‌లైన్లు, అంతర్గత రోడ్లు, డ్రెయిన్‌లు ఏర్పాటుచేయకపోవడంతో నివాసం ఉంటున్నవారు అరకొర వసతులతో సతమతమవుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫేజ్-2 బ్లాక్‌ల నిర్మాణాన్ని గాలికి వదిలేశారు. దీంతో అయిదేళ్లపాటు నిర్మాణ పనుల్లో ఎటువంటి కదలిక లేకుండాపోయింది. వాస్తవానికి రూ.లక్ష డిపాజిట్, రూ.3.5 లక్షల బ్యాంకు రుణంతో వీటిని లబ్ధిదారులు కేటాయించారు. అయితే బ్యాంక్ అధికారులు మాత్రం నిర్మాణం పూర్తికాని ఫ్లాట్లకు కూడా వాయిదాలు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. నిర్మాణంలో ఉన్న పూర్తయి ఫ్లాట్లు అప్పగించేవరకు వాయిదాల మినహాయింపు ఇవ్వాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఇటీవల వచ్చిన మంత్రి పొంగూరి నారాయణకు విజ్ఞప్తి చేశారు.

నిరుపేదల్లో చిగురిస్తున్న ఆశలు

(ఆంధ్రజ్యోతి- పెద్దాపురం)



పెద్దాపురం పరిధిలోని వాలుతిమ్మాపురంలో 33 ఎకరాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. 2019 ఎన్నికల నాటికి దాదాపు మొదటి, రెండవ విడత గృహాలు 70 శాతం పూర్తయ్యాయి. ప్రభుత్వం మారడంతో ఈ ఐదేళ్లు టిడ్కో ఇళ్లను పట్టించుకున్నా పాపాన పోలేదు. దీంతో ఇళ్ల మధ్యలో తుప్పలు పెరిగిపోవడంతోపాటు సామాన్లు దొంగలు ఎత్తుకెళ్లారు. 2024లో కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతో పేదల్లో ఆశలు చిగురించాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలో జీ ప్లస్ 3 తరహాలో తొలివిడతలో 1728, రెండో విడతలో 1584 మొత్తం 3,312 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. తొలి విడతలో లబ్ధిదారులకు దాదాపుగా ఇళ్లు అప్పగించారు. రెండవ విడత మిగిలిన 1584ఇళ్లను వైసీపీ ప్రభుత్వం ఇవ్వకుండా వారికి చుక్కలు చూపించింది. 300, 365, 430 చదరపు అడుగుల్లో ఇళ్ల నిర్మాణాలు టీడీపీ చేపడితే వైసీపీ కనీసం పూర్తయిన ఇళ్లను కూడా ఇవ్వకుండా లబ్ధిదారులను ముప్పుతిప్పలు పెట్టారు. పైగా ఇంకా పనులు పూర్తికాలేదని సాకుతో తాత్సారం చేశారు.

నివాసముండేది ఎలా..

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)



అయిదేళ్ల వైసీపీ పాలనలో మూలనబడ్డ టిడ్కో అపార్ట్‌మెంట్లులో నివాసముండేందుకు లబ్ధిదారులు అనాసక్తి ప్రదర్శిస్తున్నారు. పలు చోట్ల అపార్ట్‌మెంట్లు శిథిలం కావడం, చెద పట్టి ఉండడంతో వాటిలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. మరోవైపు తాగునీటి సమస్య ఉంది. పిఠాపురం పట్టణ శివారులోని గోర్సరోడ్డులో 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 864 ఫ్లాట్లతో కూడిన భవన సముదాయాల నిర్మాణం ప్రారంభించి 2019 జనవరిలో పూర్తిచేసింది. తాగునీటి సౌకర్యం, పార్కులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉండగానే లబ్ధిదారులకు కేటాయింపు పూర్తిచేశారు. పలువురు లబ్ధిదారులు తమకు కేటాయించిన గృహాల్లో గృహ ప్రవేశాలు చేశారు. తాగునీటి ట్యాంకు, మౌలిక సదుపాయాలు నిలిచిపోయాయి. కేవలం రంగులు మాత్రం మార్చి 2024 ఎన్నికల ముందు హడావుడిగా మళ్లీ వైసీపీ ప్రభుత్వం ప్రారంభోత్సవం నిర్వహించి 450 మంది లబ్ధిదారులకు అప్పగింత చేపట్టారు. కానీ కనీస సదుపాయాలు లేక నివాసముండేందుకు లబ్ధిదారులు చూపడంలేదు.

ఫ్లాట్‌లకు మోక్షం లభించేనా

సామర్లకోట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఫ్లాట్‌లను లబ్ధిదారులకు అప్పగించకుండా తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ముప్పుతిప్పలు పెట్టింది. సామర్లకోట పట్టణంలో జగ్గమ్మగారిపేట, ఉప్పువారి సత్రం ఎదురుగాను రెండు విభాగాలుగా 1,054 ఫ్లాట్లను టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించి సామూహిక గృహప్రవేశాలు చేయించారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు స్వాధీనం చేయకుండా ఇబ్బందులు పెట్టింది. మౌలిక సదుపాయాలను సైతం కల్పించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఇప్పటికీ తమకు మౌలిక సదుపాయాలు కల్పించలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

16అంగుళాల పుంగనూరు గిత్త జననం



కరప మండలం జిడ్.బావారంలో పుంగనూరు గిత్త

కరప, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం జడ్.బావారం గ్రామంలో 16అంగుళాల ఎత్తున్న పుంగనూరు గిత్తదూడ పుట్టి చూపరులకు కనువిందు చేస్తోంది. గ్రామానికి చెందిన పాడి రైతు కంచెర్ల నాగేశ్వరరావు గోవుల మందలోని ఒక ఆవుకు బుధవారం రెండో ఈతగా ఈ గిత్తదూడ పుట్టింది. కేవలం 16అంగుళాల ఎత్తు, 36 అంగుళాల పొడవు, 4 కిలోల బరువున్న ఈ తెల్లటి గిత్తదూడను చేసేందుకు గ్రామస్తులు క్యూ కడుతున్నారు. గత అక్టోబరులో ఇదే రైతుకు చెందిన కర్రిరంగు పుంగనూరు ఆవుకు ఇదే సైజులో ఉన్న గిత్తదూడ పుట్టడం గమనార్హం.

వివాహితను రక్షించిన మహిళా రక్షక్ టీం

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుందామని రాజమహేంద్రవరం వచ్చిన ఒక వివాహితను తూర్పు గోదావరి జిల్లా మహిళా రక్షక్ టీం రక్షించింది. రాజమహేంద్రవరం గౌతమీ ఘాట్ వద్ద మంగళవారం రాత్రి మండపేటకు చెందిన ఒక వివాహిత ఏడుస్తూ మహిళా రక్షక్ టీంకు కనిపించింది. వెంటనే వారు ఆమె వివరాలు సేకరించారు. వివాహం జరిగి ఎనిమిదేళ్లు అయిందని.. ఇద్దరు పిల్లలు ఉన్నారని.. తన భర్త వేధింపులు తాళలేక చనిపోదామని రాజమహేంద్రవరం వచ్చానని తెలియజేసింది. దీంతో స్పందించిన రక్షక్ టీం ఎస్పీ నరసింహకిషోర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు స్టేషన్‌కు తరలించి రక్షక్ టీం ఇన్‌చార్జి వివాహిత భర్త, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బుధవారం వారిని స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆమెను కుటుంబీకులకు అప్పగించారు. వివాహితను రక్షించిన రక్షక్‌టీంను ఎస్పీఅభినందించారు.

జేఎన్టీయూకేలో..

» 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాల ఆవిష్కరణ
» కార్యక్రమంలో పాల్గొన్న వీసీ మురళీకృష్ణ, రెక్టార్ రమణ
» అక్షర క్రమంలో ఆయా దేశాల జాతీయ జెండాల ఏర్పాటు
» దేశంలోని వర్సిటీల్లో ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం

వాక్ విత్ నేషన్స్





జేఎన్‌టీయూకే పరిపాలనా భవనం వద్ద ఏర్పాటు చేసిన 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలు... ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకే ప్రాంగణంలో పూర్వ విద్యార్థి సుందర్ అసోసియేట్స్ చైర్మన్ డాక్టర్ బాదం సుందరరావు సహకారంతో విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంవద్ద భిన్నత్వంలో ఏకత్వం అనే నానుడిని స్ఫూర్తిగా తీసుకుని వాక్ విత్ నేషన్స్ పేరుతో ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన 194 ప్రపంచదేశాల జాతీయ పతాకాలను ఏర్పాటుచేశారు. జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ బుధవారం ఆ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రధాన కేంద్రమైన స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉన్న 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలను ఆదర్శంగా తీసుకుని భారతదేశంలోని విశ్వవిద్యాలయాల్లో మొదటిగా జేఎన్టీయూకేలో ప్రపంచదేశాల జాతీయ జెండాలను ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ప్రపంచంలో ఆరోది..

ప్రపంచంలో జెనీవా, అమెరికాలోని న్యూయార్క్, దక్షిణకొరియాలోని సియోల్, చైనాలోని షాంగై, డొమినికన్ రిపబ్లిక్‌లోని శాంటో డొమింగోలో ప్రపంచ దేశాల జాతీయ జెండాలను ఏర్పాటు చేశారని, ఆరోది కాకినాడ జేఎన్టీయూకేలో ఏర్పాటు చేశామని వీసీ తెలిపారు. వసుదైక కుటుంబం అనేది దీని ముఖ్య ఉద్దేశ్యమని, అన్ని దేశాల జాతీయ పతాకాలు ఒకే చోట ఉండడం ద్వారా కలిగే అనుభూతి చెప్పలేనిదని అన్నారు. భూమిలోని సకల జీవరాశులు ఒక కుటుంబంగా భావిస్తారని, అందుకే ఇక్కడ ప్రపంచ దేశాల జాతీయ పతాకాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

అక్షర క్రమంలో..

ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలు అక్షర క్రమంలో ఉంటాయని, ప్రతి జెండా స్తంభానికి క్యూఆర్ కోడ్‌తో కూడిన డిస్‌ప్లేను ఉంచారు. దీని ద్వారా ఆ దేశ జనాభా, రాజధాని, కరెన్సీ తదితర పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.వర్సిటీ అనుబంధ కళాశాలలతోపాటు జిల్లాలోని ప్రతి పాఠశాల, సంస్థ జేఎన్టీయూకేను సందర్శించి ఫొటోలు తీసుకోవడాన్ని గర్వంగా భావించడంతోపాటు విజ్ఞాన, పర్యాటక ప్రదేశంగా మారబోతుందన్నారు. వాక్ విత్ నేషన్స్ అనే ప్రపంచ పౌరసత్వం స్ఫూర్తిని ప్రతిబింబించే ప్రాజెక్ట్ అని, ఈ ఐకానిక్ ప్రదర్శన మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీరమణ, ఓఎస్డీ కోటేశ్వరరావు, సీఈ శ్రీనివాసులు, మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాదరాజు, కె.పద్మరాజు, బాదం సుధారాణి పాల్గొన్నారు.



నలుగురు మత్స్యకారులూ సురక్షితం

» ఒడ్డుకు చేర్చిన కోస్ట్‌గార్డ్, మెరైన్ బృందాలు

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): నడి సముద్రంలో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులను కోస్ట్‌గార్డ్, మెరైన్ బృందాలు రక్షించాయి. కాకినాడ పర్లోవపేటకు చెందిన వాడమొదలు ధర్మరాజు, వాడమొదలు పెంటయ్య, మల్లాడి నాని, మల్లాడి సతీష్ చేపల వేటకోసం బోటులో ఈ నెల 23న బయల్దేరారు. భైరవపాలెం మీదుగా 26 నాటికల్ మైళ్లదూరం వెళ్లారు. తుఫాను ప్రభావంతో సముద్రం అలకల్లోలంగా లోపల చిక్కుకున్నారు. కాకినాడ జిల్లా మత్స్యశాఖ అధికారి వారిని రక్షించాలని ఇండియన్ కోస్ట్‌గార్డ్‌ను కోరారు. వెంటనే కోస్ట్‌గార్డ్, మెరైన్ బృందాలు ఐసీజీఎస్ కనక్లత్ బారువా అనే పెట్రోలింగ్ నౌకలో బుధవారం తెల్లవారుజామున 5.30గంటలకు వెళ్లి నలుగురినీ కాకినాడ హార్బర్‌కు తీసుకొచ్చాయి.కోస్ట్‌గార్డుతోపాటు రిలయన్స్‌ఓఎన్జీసీ అధికారుల సమన్వయంతో రెస్క్యూఆపరేషన్‌ను విజయవంతం చేసినందుకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

బస్‌షెల్టర్‌ను ఢీకొట్టిన కారు

» ఒకరి మృతి, డ్రైవర్‌కు తీవ్రగాయాలు
» కోనసీమ జిల్లా మోడేకుర్రులో ఘటన



కొత్తపేట మండలం మోడేకుర్రులో బస్‌షెల్టర్‌ను ఢీకొట్టిన కారు



ప్రమాదంలో మృతి చెందిన బీర అర్జున్

కొత్తపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్తపేటమండలం మోడేకుర్రు సమీపంలో ఓ కారు అదుపుతప్పి బస్‌షెల్టర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీనికి సంబంధించి కొత్తపేట ఏఎస్‌ఐ జీవీ కృష్ణారావు తెలిపిన వివరాలివి. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్లమూరుకు చెందిన బీర అర్జున్(22) అమలాపురం లోని గణేష్‌నగర్ పరిధి విత్తనాల కాలువ గట్టులో నివాసం ఉంటున్నాడు. అతడు మంగళవారం తెల్లవారుజాము సమయంలో డ్రైవర్ గుబ్బల విజయగోపాలకృష్ణతో కలిసి అమలాపురం నుంచి రావులపాలెం బయలుదేరాడు. కారులో బీర అర్జున్ పడుకోగా డ్రైవర్ కారు అతివేగంతో నడుపుతున్నాడు. కొత్తపేట మండలం మోడేకుర్రు మలుపు వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న బస్‌షెల్టర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ఒక వైపు నుజ్జునుజ్జవ్వడంతో బీర అర్జున్ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ గోపాలకృష్ణకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అమలాపురం ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అర్జున్ మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ కృష్ణారావు తెలిపారు.

కత్తితో వ్యక్తిపై దాడి



దాడిలో గాయపడిన బేతాళ వెంకన్న

పిఠాపురం రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం బి.కొత్తూరులో వ్యక్తిపై కత్తితో దాడి జరిగింది. గ్రామానికి చెందిన ఎస్.వీరాంజనేయులు మోటారుసైకిల్‌పై వేగంగా వెళ్లడంతో అదే గ్రామానికి చెందిన బేతాళ వెంకన్న నెమ్మదిగా వెళ్లమని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది. వెంకన్నపై వీరాంజనేయులు కత్తితో దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఇద్దరూ పరస్పరం పిఠాపురంరూరల్‌పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

కొత్తపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి ఏఎస్‌ఐ జీవీ కృష్ణారావు తెలిపిన వివరాలివి. కొత్తపేట బోడిపాలెం వంతెన సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు రెండురోజులుగా సంచరిస్తున్నాడు. మంగళవారం అతడు ఓ చెట్టు వద్ద పడుకుని ఉండడంతో స్థానికులు చనిపోయాడని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా 60ఏళ్ల పైబడిన వృద్ధుడు కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఎవరైనా తెలిసిన వారు ఉంటే స్థానిక పోలీసులను సంప్రదించాలని కోరారు.

సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



వేదాశీర్వచనం పొందుతున్న జస్టిస్ కిరణ్మయి మండవ

అన్నవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి మండవ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. పీఆర్వో కృష్ణారావు, భాస్కరప్రసాద్ పాల్గొన్నారు.

పిఠాపురం పాదగయలో..

పిఠాపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి హైకోర్టు జడ్జి కిరణ్మయి బుధవారం విచ్చేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. వేద పండితులు ఆలయ ప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ జడ్జికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు. మెరైన్ ఎస్పీ రవివర్మ దంపతులు పాదగయలోని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. వారికి ఈవో ప్రసాదాలు అందజేశారు.

పిఠాపురంలో ముగిసిన శతచండీ మహాయాగం

» సినీనటి అన్నపూర్ణ పూజలు



మహారుద్ర సహిత శతచండీ మహాయాగంలో పాల్గొన్న సినీనటి అన్నపూర్ణ

పిఠాపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్ రోడ్డులోని సద్గురు గోపాల్‌బాబా ఆశ్రమంలో మూడు రోజులు జరిగిన శ్రీమహారుద్ర సహిత శతచండీ మహాయాగం బుధవారం ముగిసింది. 108 యజ్ఞ కుండాలతో 116మంది రుత్విక్కుల మంత్రోచ్చారణల మధ్య యాగ క్రతువు నిర్వహించారు. లోక కల్యాణార్థం శ్రీసన్నిధి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 50మంది మహాసిద్ధ గురువులు, యోగులు, నాగసాధువుల సమక్షంలో సాయంత్రం మహాపూర్ణాహుతి జరిగింది. ప్రముఖ సినీ నటి అన్నపూర్ణ యాగాన్ని తిలకించిన అనంతరం గోపాల్‌బాబా ఆశ్రమంలో పూజలు చేశారు. చివరిరోజు యాగ కార్యక్రమాలను తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలి

» ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్

దివాన్‌చెరువు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన రూ.2500కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు విజ్ఞప్తి చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే మధ్యంతర భృతి ప్రకటిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన నాయకులు అధికారంలోకి వచ్చి ఆరునెలలు అయినా 12వ పీఆర్‌సీకి సంబంధించి ఏ విధమైన చర్యలు ఇంతవరకూ తీసుకోకపోవడంపట్ల విచారం వ్యక్తం చేశారు. సంబంధితులంతా దీనికోసం ఆశగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. త్వరలో వస్తున్న సంక్రాంతి పండుగ నాటికి 30శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలన్నారు. తద్వారా బోధనకు ఎక్కువ సమయం కేటాయించేలా ఉపాధ్యాయులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



దర్శనంకోసం బారులు తీరిన భక్తులు

అన్నవరంలో భక్తుల రద్దీ

అన్నవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధి బుధవారం క్రిస్మస్ సెలవుదినం సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. రాష్ట్రం నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండుగంటలు, ఉచిత దర్శనానికి మూడుగంటల సమయం భక్తులు క్యూలైన్‌లో వేచిఉన్నారు. బుధవారం ఒక్కరోజు 40వేలమంది స్వామిని దర్శించుకోగా వివిధవిభాగాల ద్వారా రూ.35లక్షల ఆదాయం సమకూరింది.

పేదలకు అండగా బీజేపీ

» రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి
» బీజేపీలో చేరిన రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు



కంబాలకు బీజేపీ కండువా వేస్తున్న పురందేశ్వరి

గోకవరం,డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వాల సంఖ్య 25లక్షలకు చేరుకుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గోకవరం-తంటికొండ రోడ్డులోని సీఎండీలే అవుట్ ప్రాంగణంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు బుధవారం పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ముందుగా మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాలకు అన్ని విధాలా న్యాయం చేసే పార్టీ బీజేపీ అన్నారు. హైందవ ధర్మాన్ని కాపాడేందుకు విజయవాడలో చేపట్టనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి అధికసంఖ్యలో ప్రజలు తరలిరావాలన్నారు. రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు చేరికతో స్థానికంగా బీజేపీ మరింత బలోపేతం అవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ అధికసంఖ్యలో దళితుల చేరికలు పార్టీ ప్రతిష్ఠతకు దోహదపడతాయన్నారు. రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వాజ్‌పేయి జయంతి, క్రిస్మస్ వేడుకల నడుమ బీజేపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీలో తనకు ఏవిధమైన బాధ్యత అప్పగించినా క్రమశిక్షణ కలిగిన సైనికుడిలా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు సోము వీర్రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేలుకూరి సూర్యనారాయణరాజు, రేలంగి శ్రీదేవి, కోడూరి లక్ష్మీనారాయణ, కాకినాడ పార్లమెంట్ అధ్యక్షుడు చెరుకూరి రామ్‌కుమార్, నాయకులు మట్టా మంగరాజు, సత్తి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక దృష్టి

» విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



డీఐజీకి పూల మొక్క అందించి ఆహ్వానిస్తున్న చింతూరు ఏఎస్‌పీ పంకజ్ కుమార్ మీనా

చింతూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మన్యంలో మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక దృష్టిసారించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. చింతూరు పోలీసు కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. గంజాయి తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మారుమూల ప్రాంతాల ఆదివాసీలతో మమేకమవ్వాలని, ఎప్పటికప్పుడు మావోయిస్టుల సమాచారం అందిపుచ్చుకోవాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు.సరిహద్దు ప్రాంతాలపై నిఘా ఉంచాలన్నారు. కేసులనమోదు, రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.సీఐదుర్గాప్రసాద్, ఎస్ఐరమేష్ పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

» విజేతలుగా నిలిచిన శ్రీకాకుళం బాలుర జట్టు



ప్రథమస్థానం సాధించిన శ్రీకాకుళం జట్టుకు కప్ అందిస్తున్న దృశ్యం

రావులపాలెం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీ క్రీడాప్రాంగణంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 50వ రాష్ట్రస్థాయి బాలుర, బాలికల జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. బాలుర విభాగం నుంచి ఫైనల్‌కు శ్రీకాకుళం, విజయనగరం బాలుర జట్లు చేరుకున్నాయి. శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విజయనగరం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. దీంతో విజేతలకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి యలమించిలి శ్రీకాంత్, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్ రెడ్డి, స్పోర్ట్స్ డైరక్టర్ వీరరాఘవరెడ్డి, అంజనికుమార్‌రెడ్డి, చిర్ల కనికిరెడ్డి తదితరులు విజేతలకు కప్, బహుమతులను అందచేశారు.

మహిళ హత్య

» ఆలస్యంగా వెలుగు చూసిన వైనం



మణి మృతదేహం

కాకినాడ క్రైం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ హత్యకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జగన్నాథపురం కేశనవారిదొడ్డికి చెందిన ఉప్పాడ మణి(31) 17ఏళ్ల క్రితం మనస్పర్థల కారణంగా తన భర్త ఆదినారాయణతో విడిపోయింది. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె నిమ్మకాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆమెకు ఏడేళ్ల క్రితం సెంట్రింగ్ పని చేసే కర్రి శంకర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అది కాస్తా సహజీవనంగా మారింది. వారు కేశనవారి దొడ్డిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. కాగా వారి మధ్య కొంతకాలంగా ఆర్థికపరమైన సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో ఈనెల 22వతేదీ అర్ధరాత్రి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణ నేపథ్యంలో శంకర్ ఆమె ముఖంపై పిడిగుద్దులు కురిపించి హత్య చేశాడు. మరుసటిరోజు ఉదయం ఆమె కుటుంబీకులకు ఫోన్ చేసి ఓ కథ అల్లాడు. తాను ఉదయాన్నే పనికి వెళ్లానని, మణికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదని తిరిగి ఇంటికి వెళ్లి చూసేసరికి మంచంపై విగత జీవురాలిగా పడి ఉందని చెప్పాడు. అనంతరం మృతురాలి సోదరుడు ఉప్పాడ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేర కు వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావ్ సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నిందితుడు శంకర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా డబ్బుల కోసం తానే మణిని హత్య చేసినట్లు అంగీకరించాడని సీఐ నాగదుర్గారావ్ తెలిపారు. ఈ ఘటనపై కాకినాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు

క్రీస్తు నామస్మరణతో మార్మోగిన నగరాలు, పట్టణాలు, పల్లెలు... చర్చిల్లో క్రైస్తవుల ప్రార్థనలు... క్రిస్మస్ విశిష్టతను వివరించిన పాస్టర్లు,

జిల్లాలోని పలు చర్చిల్లో క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. చర్చిలను విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లతో ఆకర్షణీయంగా అలంకరించారు. క్రైస్తవులు ఉదయం నుంచి చర్చిల్లో ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించి అందరిపై ఎల్లప్పుడూ ఏసుప్రభువు కృప ఉండాలని ప్రార్థించారు. ఆయా చర్చిల్లో క్రిస్మస్‌తాత, బాల ఏసు వేషధారణలు అలరించాయి. ఈ సందర్భంగా పలువురు యువతీ యువకులు ఏసుక్రీస్తు ఆరాధనా గీతాలు ఆలపించారు. సాయంత్రం కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శించారు.



కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు, క్రైస్తవేతరులు హ్యాపీ క్రిస్మస్, మేరీ క్రిస్మస్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. లోక రక్షణ కోసమే ఏసుక్రీస్తు జన్మించాడన్నారు. నగరంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ కేక్‌లు కట్ చేశారు. శాంతాక్లాజ్ వేషధారణలో ఏసు క్రీస్తు జననం తెలియజేసేలా నాటికలు, పాటలు, డ్యాన్సులతో అలరించారు. ఒకరికొకరు బహుమతులు ఇచ్చిపుచ్చుకున్నారు. నగరంలోని జగన్నాథపురం, సూర్యనారాయణపురం, డెయిరీఫారం సెంటర్, రామారావుపేట, గాంధీనగర్, రమణయ్యపేట, బాలాజీచెరువు సెంటర్, సర్పవరం ప్రధాన చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు జరిగాయి.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): క్రీస్తు పుట్టుక ప్రేమను చూపిస్తుందని ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. దుమ్ములపేటలో విక్టరీ మినిస్ట్రీస్ పాస్టర్ మోసా అబ్రహం ఆధ్వర్యాన పెద్ద సంఖ్యలో ప్రజలకు క్రిస్మస్ విక్టరీ ప్రేమ విందు నిర్వహించారు. దీనికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీడీపీ సీనియర్ నాయకులు నున్న దొరబాబు, సుంకర తిరుమలకుమార్, సూపర్‌బజార్ ఛైర్మన్ ప్రెసింగి ఆదినారాయణ, మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి సత్యప్రసాద్, మాజీ కార్పొరేటర్లు తుమ్మల సునీతరమేష్, మోసా దానమ్మ పేతురు, కామాడి సీతదశరథ, ఎన్జీవో జిల్లా ఛైర్మన్ కాశరపు సింహాద్రి, నాయకులు కిరణ్ బాబు, మోసా ఏసేబు, చోడిపల్లి ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా జగన్నాథపురం చర్చి స్క్వేర్ సెంటర్లోని సెంటినరీ ఆంధ్ర బాపిస్ట్ చర్చిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఏటిమొగ, రేచర్లపేట చర్చిల్లో క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రసంగించారు. నాయకులు, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): సర్పవరంలో జీసస్ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ డాక్టర్ వెన్నపు ప్రసాద్ పాల్, వైద్యనగర్‌లో బెరెకా బ్లెస్సింగ్ చర్చి పాస్టర్ డాక్టర్ జోసెఫ్ బిన్నీ, రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద రేస్ ఆఫ్ వర్షిప్ సెంటర్‌లో అంతర్జాతీయ ప్రసంగికుడు డాక్టర్ మూర్తిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పాల్గొన్నారు. ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని, అందరిలో మంచిని పెంచేదే క్రిస్మస్ పర్వదినమని పేర్కొన్నారు. పాస్టర్లు ఏసుక్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొవ్వొత్తులతో ఇంటింటికీ తిరిగి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సాంస్కృతిక, నృత్య పోటీల్లో యువతీ, యువకులు హుషారుగా పాల్గొన్నారు. సర్పవరం జీసస్ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ వెన్నపు ప్రసాద్ పాల్ ఆధ్వర్యంలో దుప్పట్లు, చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. విందు ఏర్పాటు చేశారు.

క్రీస్తు జననం లోకానికి పండుగ అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. గొడారిగుంటలోని ఆయన స్వగృహంలో కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని సుమారు 400 చర్చిలకు 60 వేల ప్లమ్ కేకులను అందజేసి పాస్టర్లు, క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకి పాస్టర్ల సంఘం ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు శిరంగు శ్రీనివాసరావు, పాండ్రంకి రాజు, పోసిన రాము, దాసరి శివ, జీని శ్రీనివాస్, గోపు వెంకటరమణ, గేదెల చిన్న, పుల్ల శ్రీరాములు, పండు నాయుడు, పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.



కాకినాడ నగరంలోని ఒక చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ విశ్వాసులు

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అతి పురాతనమైన ఆంధ్రా బాప్టిస్ట్ సెంటినరీ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి కేరల్స్ సర్వీస్, ఉదయం క్రిస్మస్ ఆరాధన జరిగాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల బేతెస్ద ప్రార్థనా మందిరం, బొజ్జావారితోటలోని షాలెమ్ గాస్పెల్ మినిస్ట్రీస్, రథాలపేటలోని ఇమ్మానేయుల్ సువార్త సంఘం చర్చి, పాత యాదవ వీధిలోని పెనుయేలు ప్రార్థన మందిరం, ఇందిరా నగర్, కత్తులగూడెం, మంగాయమ్మారావుపేట తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఏసుని స్మరిస్తూ క్రైస్తవులు ప్రదర్శన జరిపారు. క్రీస్తు నామస్మరణతో వీధులు మార్మోగాయి. ఏసు బోధనలను అనుసరిస్తూ సహనం, ఓర్పు అలవర్చుకోవాలని పాస్టర్లు సందేశాలిచ్చారు. పలుచోట్ల చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి సందడి చేశారు. మేరీమాత, శాంతాక్లాజ్ వేషధారణల్లో అలరించారు. పలుచోట్ల కేక్‌లు కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రాడ, కుమారపురం, విరవ, విరవాడ, భోగాపురం, రాపర్తి, పి.రాయవరం గ్రామాల్లోని చర్చిల్లో రాత్రి కేండిల్స్‌తో ప్రదర్శన నిర్వహించారు. గోకివాడలో పాస్టర్ జె.థామస్ ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. చిన్నారులు కేండిల్స్ ప్రదర్శన నిర్వహించారు. క్రీస్తునామస్మరణతో గ్రామ వీధుల్లో తిరిగారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాంప్లెక్స్, మార్కండేయపురం, పంచాయతీ కాలనీ, గాంధీనగర్, కొత్తపేట, రంగప్పచెరువు వీధిలో గల చర్చిల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి కేండిల్‌లైట్ సర్వీస్ జరిగింది. ఏసుక్రీస్తు నామస్మరణ చేస్తూ క్రైస్తవులు పురవీధుల్లో ప్రదర్శనగా తిరిగారు. చిన్నారులు క్రిస్మస్ తాత, శాంతాక్లాజ్ వేషధారణల్లో ఆకట్టుకున్నారు. క్రైస్తవ గీతాలు ఆలపించారు పలు చర్చిల వద్ద ఏసు జన్మించిన పశువుల పాకను విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రార్థనలు చేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోను, మండలంలోను క్రిస్మస్‌ను వేడుకగా జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రార్థనా మందిరాల వద్ద పేదలకు వస్త్రదానం, అన్నదానం చేశారు. సామర్లకోటలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, లూథరన్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు కిరణ్‌కుమార్, ఇమ్మానుయేల్ క్రిస్మస్ సందేశాలను అందించారు. ప్రభుత్వ కళాశాల ఆవరణలో క్రైస్తవ సంస్థలఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో క్రిస్మస్‌ను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రభువును స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. విశ్వాసులంతా క్రీస్తును స్తుతిస్తూ భక్తి పారవశ్యంతో సంతోషంగా గడిపారు. పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): కరప ఫెయిత్ గాస్పెల్ చర్చిలో బిషప్ డాక్టర్ కె.అబ్రహం శామ్యూల్, శాంతి బాప్టిస్ట్ చర్చిల్లో పాస్టర్ డి.జయప్రకాష్, చర్చి ఆఫ్ క్రైస్ట్ పాస్టర్ డాక్టర్ పి.శామ్యూల్‌రాజు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేసి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. గొర్రిపూడి జీసస్ ప్రేయర్ టవర్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ జి.జాన్‌ప్రసాద్ ఏసుక్రీస్తు సందేశాన్ని వినిపించి పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. యండమూరు గాస్పెల్ బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ ఐ.జాన్‌సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వేళంగి చర్చిలో పాస్టర్ పి.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కరపలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేసి పేదలకు దుస్తులు అందజేశారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): వాకతిప్పలోని దాకేథా మస్ పీటర్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో క్రిస్మస్ తాత వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఉప్పాడ, అమీనబాద్, మూలపేట, ఇసుకపల్లి, కోనపాపపేట తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకున్నారు. పలుచోట్ల కేక్‌లు కట్ చేశారు.



పిఠాపురంలోని పెనుయేలు ప్రార్థనా మందిరంలో చిన్నారుల ప్రదర్శన



పిఠాపురం మండలం చిత్రాడలోని బేతేలు ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ ప్రార్థనలు



సామర్లకోటలో వస్త్రదానం



పెద్దాపురంలో క్రైస్తవ విశ్వాసుల ప్రార్థనలు



కరప ఫెయిత్ గాస్పెల్ చర్చిలో క్రిస్మస్ సందేశం వినిపిస్తున్న బిషప్ డాక్టర్ అబ్రహం శామ్యూల్



కాకినాడ సెంటినరీ ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో మహిళకు చీర పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు



కాకినాడ దుమ్ములపేటలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ ఉదయ్



కాకినాడ రూరల్ సర్పవరంలో కేక్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

క్రీస్తు ప్రేమను ఆచరణలో చూపడమే క్రిస్మస్

రెవరెండ్ దేవిశెట్టి చార్లెస్, ఎస్కోల్ మినిస్ట్రీస్, సర్పవరం, కాకినాడ



ఏసుక్రీస్తు ప్రేమను ఆచరణలో చూపడమే నిజమైన క్రిస్మస్. సమస్త ప్రాణులతో స్నేహభావం, దయ కలిగినవాడు ఏసుప్రభువు. క్రీస్తు వేల ఏళ్ల క్రితం భూమిపై సంచరించి సర్వమానవాళికి తన ప్రేమను పంచారు. ఆ మహనీయుని పవిత్ర ప్రేమ, దయ, శాంతిని అందరం ఆచరణలో చూపినప్పుడే నిజమైన క్రిస్మస్ ఆనందం కలుగుతుంది. బైబిల్‌లో ప్రభువు చెప్పిన మాటల్లో ప్రేమ, కరుణ, దయను అనుసరించడం ద్వారానే ప్రపంచంలో ప్రేమ, సామరస్యాలు సాధ్యమవుతాయి. క్రీస్తు జననం తర్వాతే ఈ లోకానికి నిజమైన వెలుగు వచ్చింది.

దేవుడే నరుడై జన్మించిన రోజు

రెవరెండ్ బలగం శ్యామ్‌కుమార్, ఏసుప్రభు ప్రార్థన మందిరం, సూర్యనారాయణపురం



సర్వలోక రక్షణకు దేవుడే నరుడై జన్మించిన రోజు క్రిస్మస్. సృష్టి ఆదియందు వాక్యంగా ఉన్నవాడు శరీరధారిగా ఏసుక్రీస్తుగా జన్మించెను. తాను నిర్మించిన మానవజాతి దేవుని చిత్తమునకు దూరమై వారి ఆత్మీయ రూపాన్ని పోగొట్టుకొనుచుండగా తిరిగి వారిలో ఆత్మీయ రూపాన్ని ఎరకపరిచే నిమిత్తం ఏసుక్రీస్తు భువిపై జన్మించెను. మానవాళి కోసం ఎన్నో కార్యాలు జరిపించేందుకు క్రీస్తు మానవతారిగా భూ లోకంలో జన్మించాడు.



పెద్దాపురంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యురాలు పద్మజ



పిఠాపురంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కరప మండలం నడకుదురులో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి

పెద్దాపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యురాలు పద్మజ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బీజేపీ నాయకులు సోమూజీ, అల్లు ప్రసాద్, ప్రభాకర్, శివయ్య ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): నడకుదురులో వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, నాయకులు రొంగలి సన్యాసిరావు, చిటిమిరెడ్డి గోవిందు, తుమ్మలపల్లి గోవిందు, చలపతిరావు, సీహెచ్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ నాయకుడు డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర పూలమాల వేసి నివాళులర్పించారు. గంగరాజు, వెంకటేశ్వరరావు, పితాని లీల, రామకృష్ణ, మోహనరావు, రవికృష్ణ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేటలో వీహెచ్‌పీ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్రపటానికి ఏపీ గిడ్డంగుల సంస్థ రిటైర్డు జీఎం ఇందుగుల ప్రసాద్‌నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. అడబాల రత్నప్రసాదరావు, రెడ్నం రాజా, బుద్ధరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ నియోజకవర్గ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, నాయకులు వాసంశెట్టి శ్రీనివాసరావు, బుర్రి మురళీధరరావు, తోట ఏడుకొండలు, అడబాల వీరమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు, నాయకులు మలిరెడ్డి నారాయణరావు, పడాల శ్రీను, కర్రి సత్యనారాయణ, బుర్రా సీతారామాంజనేయ, మేడసాని కామరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలను కొనియాడారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): వాజ్‌పేయిశత జయంతి సందర్భంగా కొత్తపల్లిలో ఆయన చిత్రపటానికి బీజేపీ సీనియర్ నాయకులు రవణం సుబ్రహ్మణ్యం, మేడసాని వరలక్ష్మీ నారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్తులకు, ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. గౌరీశంకర్, మాజీ సర్పంచ్ రాజాపంతుల స్వామి, గురు స్వామి త్రిమూర్తులు, కొండపల్లి చలపతి, బొడ్డు నారాయణరావు, ఆకుల గంగాధర్ పాల్గొన్నారు.



కాకినాడ సర్పవరంలో...



సామర్లకోటలో...



గొల్లప్రోలులో...



కొత్తపల్లిలో...

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కాకినాడ సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నెహ్రూ కాన్వెంట్ యూపీ స్కూలు 1988-89 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆహ్లాదభరితంగా సాగింది. తిలక్ వీధిలోని వెండి, బంగారు వర్తక సంఘం కల్యాణ మండపంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఆనాటి సంఘటలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు బాల, తులసి, సత్యవేణి, సుబ్బలక్ష్మిలను శాలువాలతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు సాయిరామ్, మురళీ, రమణారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఫణిభాస్కర్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా నాయకమ్మ, శశికళ తదితరులు పాల్గొన్నారు.



గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ

గొల్లప్రోలు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండు, రైల్వే స్టేషన్, శివాలయం, ఇతర ఆలయాల వద్ద చలిలో నిద్రిస్తున్న అభాగ్యులకు పీసేవ సభ్యులు దుప్పట్లు, రగ్గులు అందజేశారు. ఆపన్నులకు అండగా ఉండేందుకు పీసేవ కృషి చేస్తోందని వ్యవస్థాపక అధ్యక్షుడు చామంతి నాగేశ్వరరావు, అధ్యక్షుడు చందు బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో పీసేవ, స్వచ్ఛ గొల్లప్రోలు ప్రతినిధులు కేవీవీ సత్యనారాయణ, కొమ్ము సత్యనారాయణమూర్తి, పల్లపురాజు, దాడి పద్మనాభం, కొశిరెడ్డి రాజా, పెదిరెడ్ల వెంకటరాజు, స్టేషన్ మాస్టర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మనుస్మృతి ప్రతుల దహనం

కాకినాడ సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మనుస్మృతి దహన దివస్ సందర్భంగా ఇంద్రపాలెం వంతెన సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం కేవీపీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. సీనియర్ దళిత నాయకుడు అయితాబత్తుల రామేశ్వరరావు, సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు డాక్టర్ భానుమతి, కేవీపీఎస్ నాయకులు మోర్త రాజశేఖర్, పెద్దిరాజు, ఆర్పీఐ నాయకుడు పిట్టా వరప్రసాద్, మాల మహానాడు నాయకుడు సిద్ధాంతుల కొండబాబు ప్రసంగించారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి మనుస్మృతిని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వివిధ సంఘాల నాయకులు కేఎస్ శ్రీనివాస్, తాడి బాబ్జీ, దువ్వా శేషుబాబ్జీ, పలివెల వీరబాబు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



మను స్మృతి ప్రతులను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

ట్యాంకర్ల ద్వారా కలుషిత నీరు

గొల్లప్రోలు పట్టణ ప్రజలకు ఇక్కట్లు

గొల్లప్రోలు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాటిపర్తి బోర్లు నుంచి గొల్లప్రోలు రక్షిత మంచినీటి పథకానికి వచ్చే పైపులైన్లు మార్పే పనులు నిర్వహిస్తుండడంతో పట్టణంలో ఐదు రోజులుగా కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మంచినీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. ఈ విధంగా ట్యాంకర్ల ద్వారా 17వ వార్డులో వచ్చిన తాగునీరు రంగుమారి కలుషితమై ఉండడంతో ప్రజలు విస్మయానికి లోనయ్యారు. ఇది కనీసం వాడుక నీరుగా కూడా పనిచేయదని ప్రజలు తెలిపారు. నీరు వాసన వస్తోందన్నారు. పట్టణంలో తాగునీటి సరఫరాపై నగర పంచాయతీ అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని వారు చెప్పారు.



17వ వార్డులో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసిన నీరు ఇదే

21మందిపై బైండోవర్

జగ్గంపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పాత కేసుల్లో ఉన్న జూదరులను 21మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. కిర్లంపూడిలో 13, జగ్గంపేటలో 3, గండేపల్లిలో ఐదుగురిపై బైండోవర్ నమోదు చేశామన్నారు. గుండాల, పేకాట, కోడిపందాలు, క్రికెట్‌బెట్టింగ్‌లు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఘనంగా క్రిస్మస్ వేడుకలు




రంపచోడవరం: లూథరన్ చర్చిలో దుస్తులు పంపిణీ, వి.ఆర్.పురం బీసీకాలనీ చర్చిలో కేక్‌కట్ చేస్తున్న దృశ్యం





మోతుగూడెంలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం, దేవీపట్నం మండలంలో క్రిస్మస్ వేడుకలు




వై.రామవరం లూథరన్ చర్చిలో బైబిల్ వాక్యాలు చదువుతున్న పాస్టర్ గాబ్రియల్

చింతూరు: చర్చి ఫాదర్‌కు మిఠాయిలు తినిపిస్తున్న ఆయుర్వేద నిపుణుడు జమాల్ ఖాన్

రంపచోడవరం, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రీస్తు దేవాలయాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చర్చిల్లో ప్రార్థనలు చేశారు. స్థానిక లూథరన్ చర్చిలో బత్తుల సురేష్ సహకారంతో పాస్టర్ మద్దికొండ ఎర్నెస్ట్‌బాబు దంపతులు పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. దేవుని పరిచర్యతో పాటు పేదలకు సహాయం చేయడం ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గురు మండలి అధ్యక్షుడు పారీస్, సంఘ పెద్దలు టేకూరి సుధాకర్, ముంగారి సుకుమార్, తండు కుమార్ బాబు పాల్గొన్నారు.

కేక్స్ కట్ చేసి వేడుకలు

వి.ఆర్.పురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో క్రైస్తవులు ప్రార్థనా మందిరాల్లో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. వీ.ఆర్.పురంలో ఉన్న అన్నిప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు బుధవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు పుట్టినరోజు సందర్భంగా ప్రార్థనా మందిరాల్లో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఆయా చర్చి పాస్టర్లు డేవిడ్ లివింగ్‌స్టన్, కృపారావు, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

మోతుగూడెం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో మంగళవారం లివింగ్‌స్టోన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు అంబరాన్ని అంటాయి. అధిక సంఖ్యలో క్రైస్తవులు చర్చికి తరలివచ్చి ప్రార్థనలు చేసి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. లివింగ్‌స్టోన్ చర్చి పాస్టర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచంలో మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

దేవీపట్నం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట, శరభవరం, దేవారం, పాముగండి, చొప్పకొండ, మునినిగుంట, ఇందుకూరు1 తదితర ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో బుధవారం క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కేక్ కట్ చేసి క్యాండిల్స్ వెలిగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ఎటపాక: కృష్ణవరం చర్చిలో కేక్ కటింగ్ చేస్తున్న పాస్టర్ సింగయ్య

లూథరన్ చర్చిలో క్రిస్మస్

వై.రామవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వై.రామవరం బస్ సెంటర్‌లో ఉన్న లూథరన్ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ గాబ్రియల్ ఆధ్వర్యంలో క్రీస్తు జననం వివరిస్తూ పలు బైబిల్ వాక్యాలు వినిపించారు. క్రిస్మస్ చెట్టును విద్యుత్ దీపాలతో అలంకరించారు. చర్చిలో పలువురు పాటలు, డ్యాన్స్‌లతో సందడి చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్లు నక్కా నహోం, కుటుంబరావు పలువురు పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

దయా గుణంతో మెలగాలి

చింతూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు, ఆయుర్వేద నిపుణుడు జమాల్ ఖాన్ క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన చింతూరులోని పలు చర్చిలు వద్దకు వెళ్లి క్రైస్తవులకు మిఠాయిలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాటి మానవుల పట్ల సానుభూతి, దయా గుణంతో మెలగాలని, పేద వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

క్రీస్తు జీవితం ఆదర్శప్రాయం

ఎటపాక, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తన బోధనలు ద్వారా విశ్వమానవాళికి అందించారని, క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పాస్టర్లు ఏసుదాసు, రజినీ, అశోక్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మంగళవారం అనేక గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. చర్చిల్లో కేక్‌లు కట్ చేసి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు క్రీస్తు వేషధారణలతో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఎమ్మెల్యే శిరీషదేవిపై ఆరోపణలు సరికాదు



కూనవరం: మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు ప్రకాష్‌రావు

కూనవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బరపాటి ప్రకాష్‌రావు అధ్యక్షతన బుధవారం మండల కమిటీ సభ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రకాష్‌రావు మాట్లాడుతూ రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి, ఆమె భర్త మఠం భాస్కర్‌పై మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు తరచూ నిరాధార ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో అంబులెన్స్ ఏర్పాటు చేశారని, పార్టీలకు అతీతంగా కార్యకర్తలు ఇబ్బందుల్లో ఉంటే వారికి ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. ఎప్పటికప్పుడు నియోజకవర్గంలోని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఏనాడు కూడా గిరిజనులు పడే ఇబ్బందులను అసెంబ్లీలో ప్రస్తావించిన దాఖలాలు లేవన్నారు. సమావేశంలో అరకు పార్లమెంటు ప్రతినిధి భాస్కరరావు, మాజీ ఎంపీపీ పోడియం అప్పారావు, రసూల్, షరీఫ్, సాంబయ్య, చౌదరి సీతారాములు, బూత్ ఇన్‌చార్జి ఎడ్ల రాంబాబు, నాచుపల్లి వెంకటేశ్వర్లు, ఎడ్ల వెంకటేష్, పారి సోమయ్య, టీడీపీ నాయకులు,కార్యకర్తలుపాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఆరోపణలు హాస్యాస్పదం

చింతూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ ఆరోపణలు హాస్యాస్పదమని టీడీపీ చింతూరు మండల అధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి పేర్కొన్నారు. బుధవారం టీడీపీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే శిరీషదేవి చేస్తున్న పాలనను చూసి అనంతబాబు ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో అనంతబాబు చేసిన అకృత్యాలు ప్రజలందరికీ తెలుసన్నారు. ఇప్పటికైనా అనంతబాబు బుద్ధి తెచ్చుకుని నిజాలు మాట్లాడాలన్నారు. నాయకులు ఆకోజు నూకాచారి, తుర్రం ముత్తయ్య, సయ్యద్ ఆసిఫ్, అనిగి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం

రాజవొమ్మంగి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి, ఆమె భర్త విజయభాస్కర్‌పై ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆరోపణలు చేయడం సరికాదని టీడీపీ మండల అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎవరికి ఏకష్టం వచ్చినా ఎమ్మెల్యే శిరీషదేవిసమస్యను పరిష్కరిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే సొంత నిధులతో ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. అటువంటి వారిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

మన్యంలో ముసురు

మోతుగూడెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో మూడు రోజుల నుంచి మన్యంలో ముసురు వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై కొద్దిపాటి వర్షం కురుస్తోంది. సోమవారం నుంచి కురుస్తోన్న తేలికపాటి జల్లులకు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. చలి గాలులు వీయడంతో ప్రజానీకం ఇబ్బందికి గురవుతున్నారు. చిరుజల్లులు పడటంతో పర్యాటక ప్రాంతాలకు వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

తుని రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు సన్మార్గాన్ని చూపుతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని తుని పట్టణంలో ఎస్ఎంబీ చర్చిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే దివ్య గోపీనాథ్ దంపతులు క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చి కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో యనమల రాజేష్, తుని పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఇనగంటి సత్యనారాయణ, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి), సిద్ధాంతపు సత్తిబాబు, మల్లగణేష్‌కుమార్, అల్లురాజు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): శాంతి సౌభ్రాతృత్వాలే క్రిస్మస్ పండుగ ధ్యేయమని, మానవాళి అంతా ప్రశాంతంగా ఉండాలని ఏసుప్రభు బోధనల సారాంశమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. ప్రత్తిపాడులోని సీబీఎం చర్చి, ఇమ్మానియేలు చర్చిల్లో బుధవారం క్రిస్మస్ సందర్భంగా కేక్‌లు కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆచరణదాయకమైనవన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్ పాల్గొన్నారు.

కోటనందూరులో..

కోటనందూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటనందూరు, కాకరాపల్లి, అల్లిపూడి, కేవీ చిన్నయ్యపాలెం, ఎస్ఆర్‌పేట, భీమవరపుకోట, జగన్నాథపురం తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు కార్యక్రమాలు నిర్వహించారు.

రౌతులపూడిలో..

రౌతులపూడి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌతులపూడి, ములగపూడి, పైడిపాల, మల్లవరం, మాతయ్యపేట, రాఘవపట్నంల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గండేపల్లిలో..

గండేపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు దైవబిడ్డలు ఘనంగా జరుపుకున్నారని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. మండలంలోని జెడ్ రాగంపేటలో క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గండేపల్లిలోని శ్రీ గీతం స్కూల్‌లో కరస్పాండెంట్ వీఎస్‌వీ చౌదరి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో పాస్టర్ చంద్ర, రవి ప్రార్థనలు చేశారు.

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలపాలెం రిఫ్యూజ్ ట్రైబర్ చర్చిలో క్రిస్మస్ వేడుకలకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ క్రీస్తు సూచించిన మార్గంలో ప్రజలంతా నడవాలన్నారు. ఏలేశ్వరం సీఎంవో, ఆర్‌సీఎం, లూథరన్ చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొది రెడ్డి గోపి, బసా ప్రసాద్, నూకతాటి ఈశ్వరుడు, బెల్లాని శ్రీను పాల్గొన్నారు.

శంఖవరంలో..

శంఖవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హాజరై ప్రార్థనలు చేశారు.



ప్రత్తిపాడు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ



క్రిస్మస్ వేడుకల్లో జనసేన జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్



తుని ఎస్ఎంబీ చర్చిలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే దివ్య

'వరి వెదజల్లడమే ఉత్తమం'



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శంఖవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వరిపంటలో వెదజల్లడంతోనే ఉత్తమమైనఫలితాలు సాధించడంతోపాటు లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ అధికారి పి.గాంధీ సూచించారు. శంఖవరం, నెల్లిపూడిల్లో 'పొలం పిలుస్తుంది' బుధవారం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్, మౌళి ప్రసాద్, బాబూరావు పాల్గొన్నారు.

'సనాతన ధర్మాన్ని పరిరక్షిద్దాం'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5న విజయవాడలో జరిగే బహిరంగ సభకు తరలిరావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు సమావేశం నిర్వహించారు. ఈమేరకు బుధవారం యర్రవరం ఆంజనేయస్వామి ఆలయంవద్ద బీజేపీ నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు.

పేదలకు వస్త్రాల పంపిణీ

జగ్గంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో క్రిస్మస్ సందర్భంగా బుధవారం వలస కార్మిక కుటుంబీకులకు క్యాండిల్ యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ చైర్మన్ జుత్తుక నాగేశ్వరరావు నూతన వస్త్రాలు, దుప్పట్లు పంచారు. యూత్‌సభ్యులు పాల్గొన్నారు.

బియ్యం బస్తాల అందజేత

కిర్లంపూడి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట చర్చికి కిర్లంపూడి మండలంలోని రామచంద్రపురంలో జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ బియ్యం బస్తాలు అందజేశారు.

వధూవరులకు పెళ్లికానుక చెక్ అందజేత



వధూవరులకు చెక్ అందజేస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి ఆధ్వర్యంలో జగ్గంపేటలోని యువతుల పెళ్లి సమయంలో నూతన వధూవరులకు పెళ్లికానుక చెక్‌లు అందజేస్తున్నారు. దీనిలోభాగంగా ఇటీవల కిర్లంపూడి గ్రామానికి చెందిన నేదూరి లక్ష్మణరావు కుమార్తె అశీశ్వరిదేవి, కొలిబోయిన బాబి వివాహం సందర్భంగా జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ రూ.20వేల చెక్‌ను బుధవారం అందజేశారు. నియోజకవర్గంలోని ఆడపిల్లలకు భరోసా ఇచ్చేందుకు పెళ్లి సమయంలో ఈ ఆర్థిక సాయం అందిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, జగపతినగరం సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, జిల్లా నాయకులు తూము కుమార్, కిర్లంపూడి క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చినబాబు, జాస్తి వసంత్, జీను మణిబాబు పాల్గొన్నారు.

'అన్నార్తులకు అండగా సీఎం సహాయ నిధి'



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అన్నార్తులకు అండగా సీఎం సహాయ నిధి దోహదపడుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో గురై శస్త్రచికిత్సలు ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పలువురికి సీఎం సహాయ నిధి ద్వారా నగదు చెక్కులను తేటగుంట టీడీపీ క్యాంప్‌కార్యాలయంలో అందజేశారు. అనంతరం నియోజకవర్గంలో మూడు మండలాల్లోని పలు పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్లను ఆమె సంబంధిత పంచాయతీ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, యనమల లక్ష్మణరావు, ఆరుగుల నరసింహమూర్తి, కాపారపు అబ్బులు ఉన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

ఎంపీడీవోకు దళితుల ఫిర్యాదు

రౌతులపూడి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన తమకు ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ ఎంపీడీవోకు దళితులు బుధవారం వినతిపత్రం అందజేశారు. తమకఫీల్డ్ అసిస్టెంట్ సరిగా పనలు కల్పించకుండా ఇబ్బందులు సృష్టిస్తున్నారని వారు పేర్కొన్నారు.

గోకవరానికి తరలివెళ్లిన కూటమి నాయకులు

దేవీపట్నం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలానికి చెందిన కంబాల శ్రీనివాసరావు బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, బీజేపీ నాయకులు సోము వీర్రాజు ఆధ్వర్యంలో బీజేపీలోకి చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి దేవీపట్నంనుంచి కూటమి నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

వాజ్‌పేయి శత జయంతి వేడుకలు



తునిరూరల్, ఏలేశ్వరంలలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



తుని రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతరత్న మాజీప్రధాని అటల్‌బిహారీ వాజపేయి శత జయంతి వేడుకలు తిరుపతిలో బీజేపీ శ్రేణులు నిర్వహించారు. తుని నియోజకవర్గ బీజేపీ కార్యవర్గ సభ్యులతో కలిసి కార్యకర్తలు వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలు కొనియాడారు.కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చక్రవర్తుల శ్రీనివాస్, గాజులవేణుగోపాలస్వామి, ప్రగడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి ఎంతో కృషి

ప్రత్తిపాడు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): శాభివృద్ధికి ప్రధానిగా వాజ్‌పేయి ఎంతో కృషి చేశారని బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షులు సింగిలిదేవ్ సత్తిరాజు అన్నారు. దివంగతప్రధాని వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయం వద్దవాజ్‌పేయి చిత్రపటానికి మండల బీజేపీ అధ్యక్షులు కందా వీరాస్వామి తదితరులు సింగిలిదేవ్‌సత్తిరాజు తదితరులు నివాళులర్పించారు.అంత్యోదయ సిద్ధాంతాన్ని ఆచరణలోపెట్టిన మహనీయుడు,ప్రోగ్రాన్ అణుపరీక్షలు, నాలుగు రోడ్లరహదారుల నిర్మాణం, సాంకేతిక అభివృద్ధికి, వాజ్‌పేయ్ఎంతో కృషి చేశారన్నారు.అనంతరం అనంతరంస్వీట్లుపంచారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజా కింగ్‌బాబురాజు, కొల్లా శ్రీనివాసు,గున్నాబత్తుల రాజబాబు, ఇంటిబాబురావు, తదితరులు పాల్గొన్నారు. ధర్మవరంలో మండల బీజేపీ ప్రధానకార్యదర్శినక్కాశ్రీను ఆధ్వర్యంలో వాజ్‌పాయ్ జయంతి వేడుకలు నిర్వహించారు.

వాజ్‌పేయికి నివాళులు

గండేపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా గ్రంథాలయ అధికారి కె.అశోక్‌కుమార్ మాట్లాడుతూ నవ శకానికి నాంది పలికిన యోధుడు మృదుభాషి, స్థితప్రజ్ఞత కల్గిన రుషి, దేశం కోసమే జీవించిన తాపసి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తోటకూర గంగాధర్, కె.నాగబాబు, సోమరాజు, సుజాత, రమస్య తదితరులున్నారు.

వాజ్‌పేయి పాలన సువర్ణాధ్యాయం

ఏలేశ్వరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధానిగా ఏబీ వాజ్‌పేయి పాలన సువర్ణాధ్యాయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఉమ్మిడి వెంకట్రావు అన్నారు. మండలంలోని యర్రవరం గ్రామంలో వాజ్‌పేయి జయంతి సందర్భంగా బుధవారం వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానికులకు మిఠాయిలు పంచారు. బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

పాఠశాల ఏర్పాటు చేయండి

దేవీపట్నం, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): కొండమొదలు పంచాయతీ పరిధిలో బడిగుంట గ్రామానికి తక్షణమే పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుచేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన సమావేశంలో శేఖర్ మాట్లాడుతూ బడిగుంటలో 28 ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నారన్నారు. ఇంటింటికి తాగునీరు అందించాలని, హౌసింగ్ కాలనీ మంజూరు చేయాలని తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు, వంజం ముత్తమ్మ, పొడియం గంగాభవానీ పాల్గొన్నారు.

ఊట్ల క్వారీ నిర్వాహకులపై కేసు నమోదు చేయాలి

రంపచోడవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్ల క్వారీ ప్రమాదంలో వ్యక్తి మృతికి కారణమైన నిర్వాహకులపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన్న కిరణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు లోతా రామరావు, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న క్వారీని నిలుపుదల చేయాలని, ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలన్నారు. ఏజెన్సీలో విచ్చలవిడిగా మైనింగ్ క్వారీలు జరుగుతుంటే అధికారులు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్వారీలు, విచ్చలవిడి బ్లాసింగ్‌లపై అధికారులు దృష్టిసారించి నిరోధించాన్నారు. చికిత్స పొందుతున్న మరో బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మంగరాజుని మరువలేం

ఎటపాక,డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మచ్చలేని నాయకుడు దివంగత కామ్రేడ్ కందుకూరి మంగరాజు అని, ఆయన్ను ఎప్పటికీ ఏజెన్సీ ప్రజలు మరువలేరని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవీ సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం మంగరాజు 5వ వర్ధంతిని గన్నవరంలో నిర్వహించారు. ఆయన స్థూపం వద్ద పూలమాలలువేసి నివాళులర్పించారు. జోహార్లు మంగరాజు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, సీపీఐ సీనియర్ నాయకులు వల్లభనేని సత్యనారాయణ, గుజ్జా మోహన్‌రావు, వాసం రాము, ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ, ఎంపీటీసీ కంటే రాజు, మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, సర్పంచ్ గడ్డం భద్రమ్మ, వరదా బ్రహ్మం పాల్గొన్నారు.

కలుషిత ఆహారమే అనారోగ్యానికి కారణం

చింతూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో కలుషిత ఆహారం తీసుకుంటున్న ప్రతి ఒక్కరూ అనారోగ్యం బారిన పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. బుధవారం చింతూరు వచ్చిన వీరభద్రం నిమ్మలగూడెంలోని జమాల్‌ఖాన్ ఆయుర్వేద ఆశ్రమాన్ని సందర్శించారు. ఈసందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ జమాల్ ఖాన్ చేస్తున్న సేవలు సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. సీపీఎం నాయకులు బ్రహ్మాచారి, పల్లపు వెంకట్, సీసం సురేష్, పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు తదిరులు తమ్మినేని వీరభద్రం వెంట ఉన్నారు.